ఎంపీడీఓ వెంకటరమణకు సన్మానం


ఎంపీడీఓను సన్మానిస్తున్న పంచాయతీ, సచివాలయ కార్యదర్శులు

విస్సన్నపేట: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఉత్తమ సేవా పురస్కారం కింద పంచాయతీరాజ్, డ్వామా నుంచి రెండు ఉత్తమ అవార్డులను ఎంపీడీఓ ఎస్ వెంకటరమణ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు నుంచి మంగళవారం అందుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం కార్యదర్శులు బుధవారం ఎంపీడీఓను సన్మానించారు.

కోర్టు సూపరింటెండెంట్ సేవలు మరువలేనివి


నాగేశ్వరరావును సత్కరిస్తున్న మేజిస్ట్రేట్ వేల్పుల కృష్ణమూర్తి, న్యాయవాదులు


నూజివీడు: న్యాయశాఖలో వివిధ హోదాల్లో 45 ఏళ్లపాటు పదవీ బాధ్యతలు నిర్వహించిన కోర్టు సూపరింటెండెంట్ చిట్టూరి నాగేశ్వరరావు సేవలు మరువలేనివని స్పెషల్ మెజిస్ట్రేట్ కోర్టు స్పెషల్ మేజిస్ట్రేట్ వేల్పుల కృష్ణమూర్తి పేర్కొన్నారు. ఇటీవల పదవీ విరమణ చేసిన నాగేశ్వరరావుకు కోర్టులో బుధవారం వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా మేజిస్ట్రేట్ మాట్లాడుతూ విధి నిర్వహణలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా అంకిత భావంతో సేవలు అందించారని చెప్పారు. మేజిస్ట్రేట్ కోర్టు ఏపీపీ కె.కిషోర్‌బాబు మాట్లాడుతూ కోర్టు సిబ్బందికి, జూనియర్ న్యాయవాదులకు వృత్తిలో మెలకువలను తెలిపేవారన్నారు. కార్యక్రమంలో పట్టణ ఎస్సై-2 వెంకటేష్, ఏఎస్సై ప్రసాద్ పాల్గొన్నారు.

రెండో విడత నాడు-నేడు పనులు పూర్తి చేయాలి

ఎంపీడీఓ వెంకటరమణ


హెచ్‌ఎంల సమావేశంలో సూచనలిస్తున్న ఎంపీడీఓ వెంకటరమణ

విస్సన్నపేట: మండలంలో రెండో విడత నాడు-నేడు కింద వివిధ పాఠశాలల్లో జరుగుతున్న పనులు ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని ఎంపీడీఓ ఎస్ వెంకటరమణ అన్నారు. స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయం మీటింగ్ హాల్లో రెండో విడత నాడు-నేడు పనులు జరుగుతున్న పాఠశాలల హెచ్‌ఎంలతో బుధవారం సమావేశం నిర్వహించారు. తుదిదశలో ఉన్న పనులు సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 సుధాకర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సాయిరాఘవి, వేమిరెడ్డిపల్లి హైస్కూల్ హెచ్‌ఎం రవికుమార్ పాల్గొన్నారు.





జగన్‌ను ఓడించడం ఎవరి తరమూ కాదు

ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు

నూజివీడు: ఒక్కొక్కటి వచ్చినా, అన్నిపార్టీలు కలిసొచ్చినా ప్రజల గుండెల్లో గూడు కట్టుకొన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఏమీ చేయలేరని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. ఎమ్మెల్యే స్థానిక కార్యాలయ ఆవరణలో బుధవారం సచివాలయ కన్వీనర్లతో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలని, ఇందుకోసం ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేయాలన్నారు. ఎన్నికలు దగ్గర పడే సరికి టీడీపీ నాయకులకు ప్రజలు గుర్తుకువచ్చారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తూనే మరో వైపు అభివృద్ధి చేస్తోందని వివరించారు. ఈ నాలుగేళ్లలో రాష్ట్ర వ్యాప్తంగా 17 మెడికల్ కాలేజీలను తీసుకొచ్చిన ఘనత వైఎస్ జగన్ ప్రభుత్వానిదేనన్నారు. చంద్రబాబు 14 ఏళ్ల తన పాలనలో ఎన్ని మెడికల్ కాలేజీలు తీసుకువచ్చారో చెప్పాలన్నారు. ప్రజల మనస్సుల్లో ఉన్న వైఎస్ జగన్‌ను ఓడించడం ఎవరి తరం కాదన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కోపరేటివ్ యూనియన్ లిమిటెడ్ ఛైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి, ఎంపీపీ ఆరేపల్లి శిరీష, జెడ్పీ వైస్ ఛైర్మన్ గుడిమళ్ల కృష్ణంరాజు, విద్యా మౌలిక సదుపాయాల కల్పనా సంస్థ డైరెక్టర్ కలగర వెంకటేశ్వరరావు, హిస్టరీ అకాడమీ డైరెక్టర్ స్వరూపరాణి, జెడ్పీటీసీ సభ్యుడు ప్రతాప్, వైఎస్సార్ సీపీ నూజివీడు పట్టణ, మండల, ముసునూరు, ఆగిరిపల్లి మండలాల అధ్యక్షులు రాము, శివ, నాగవల్లేశ్వరరావు, నరసింహారావు, మున్సిపల్ వైస్ ఛైర్మన్‌లు సత్యనారాయణ, వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనారిటీ విభాగం ఏలూరు జిల్లా అధ్యక్షుడు చరణ్, పూర్ణిమ పాల్గొన్నారు.

పంచాయతీల్లో నగదు రహిత చెల్లింపులు



చాట్రాయి: గ్రామ పంచాయతీల్లో నగదు రహిత చెల్లింపు నిర్వహిస్తున్నట్టు ఏలూరు జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ విశ్వనాథ్ తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు గ్రామ పంచాయతీల్లో నగదు రహిత చెల్లింపులపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో బుధవారం ఆయన మాట్లాడారు. ఇంటి, కుళాయి పన్నులు ఇక నుంచి నగదు రహిత చెల్లింపులు జరుగుతాయని తెలిపారు. మూడు వేలు జనాభా దాటిన గ్రామ పంచాయతీలకు ఏటీఎం లాంటి మిషన్లు అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కె.దుర్గా ప్రసాదు, ఈఓపీఆర్‌డీ నాగరాజు పాల్గొన్నారు.

ప్రభుత్వ సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలి

కె.తాడేపల్లి(విజయవాడరూరల్): రాష్ట్ర ప్రభుత్వం డ్వాక్రా గ్రూపు మహిళలకు అందజేస్తున్న సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కొత్తూరు తాడేపల్లి సర్పంచ్ ఉయ్యూరు గోపాలరావు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ క్రాంతి పథం కింద మంజూరు చేసిన గొర్రెపిల్లల యూనిట్లను బుధవారం గ్రామంలో లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఒక్కో యూనిట్ ఖరీదు రూ.50వేల రూపాయలని తెలిపారు. ఉపసర్పంచ్ శేఖర్, ఏపీఎం చంద్రశేఖర్, సీసీ రామారావు, పంచాయతీ కార్యదర్శి పి.మురళీమోహనరావు, పశువైద్యులు డి.హరీష్ పాల్గొన్నారు.

19న పోలింగ్ నిర్వహణపై అవగాహన

ముసునూరు: మండలంలో ని రెండు గ్రామాల్లోని రెండు వార్డులకు ఈ నెల 19న పో లింగ్ నిర్వహణపై అవగా హన కార్యక్రమం నిర్వహించినట్టు ఎంపీడీఓ జి. రాణి తెలిపారు. ముసునూరు లోని 11వ వార్డుకు, కాట్రేనిపాడులో 10వ వార్డుకు నిర్వహించే ఉపఎన్నికలపై బుధవారం నమూనా పో లింగ్ నిర్వహించారు. బ్యాలెట్ బాక్సులను పరిశీలించి, సిబ్బందికి అప్పగించారు.

గంజాయి విక్రేతల అరెస్ట్

ముసునూరు: నూజివీడు, ఏలూరు పరిసర ప్రాంతాల్లో గంజాయి విక్రయిసస్తున్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్టు ఎస్సై ఎం.కుటుంబరావు తెలిపారు. ముసునూరు నేలపాటి వారి కుంట వద్ద బుధవారం వాహన తనిఖీలు చేస్తుండగా ఏలూరుకు చెందిన తిరునగరి మోహన్‌కుమార్, నూజివీడులోని ఐదు బజార్ల సెంటర్‌కు చెందిన నిమ్మకూరి త్రినాథ్, నిమ్మకూరి ఈశ్వర వెంకట సత్యనారాయణలను 3.250 కేజీల గంజాయితో అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. వీరిపై క్రిమినల్ కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

జూదరుల అరెస్ట్

నూజివీడు: మండలంలోని సిద్ధార్థ నగర్ అటవీ ప్రాంతంలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై బుధవారం రూరల్ ఎస్సై తలారి రామకృష్ణ దాడి చేశారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న ముగ్గుర్ని అదుపులోకి తీసుకున్నారు. రూ.4,100, 11 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఆరుగురి అరెస్ట్

చాట్రాయి: మండలంలోని మర్లపాలెం గ్రామంలో పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్ట్ చేసినట్టు ఎస్సై స్వామి బుధవారం తెలిపారు. రూ.14,200 స్వాధీనం చేసుకున్నట్టు పేర్కొన్నారు.

పవిత్ర మట్టి కలశాలకు ప్రత్యేక ప్రణామాలు

ముసునూరు: నా భూ మి-నాదేశం, నేల తల్లికి వందనం కార్యక్రమంలో భాగంగా కలశాలను జిల్లా కేంద్రానికి పంపినట్టు ఎంపీడీఓ జి.రాణి తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లోని సచివాలయాల వద్ద ఏర్పా టు చేసిన వీరుల స్తూపాల వద్ద నుంచి రాగి కలశాల్లో నింపిన పవిత్ర మట్టికి ఆమె బుధవారం అధికారులు, సిబ్బందితో కలిసి ప్రత్యేక పూజలు చేసి, వందనం చేశారు. అనంతరం జిల్లా కేంద్రానికి తరలించారు. ఈఓపిఆర్డీ సత్యనారాయణ, కార్యదర్శులు ఆరేపల్లి, యోహాను, స్రవంతి పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా పరిశీలన వేగవంతం చేయాలి

చాట్రాయి: ఓటర్ల జాబితా పరిశీలన వేగవంతం చేయాలని నూజివీడు సబ్‌కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ అన్నారు. చాట్రాయి మండలం సూరంపాలెం, చిత్తపూరు, పోతనపల్లి, తుమ్మగూడెం, నరసింహరావుపాలెం గ్రామాల్లో నిర్వహిస్తున్న ఓటర్ల జాబితా పరిశీలనను ఆయన బుధవారం పరిశీలించారు. ఓటర్ల జాబితా పరిశీలన సక్రమంగా నిర్వహించని వారిపై తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ విశ్వనాథరావు పాల్గొన్నారు.

ఉత్తమ వీఆర్వోకు సన్మానం

ముసునూరు: ఉత్తమ వీఆర్వో పురస్కారం అందుకున్న గుళ్లపూడి వీఆర్వో పి.నవీన్‌ను బుధవారం సాయంత్రం సర్పంచ్ రాజబోయిన శ్రీదేవి శ్రీనివాస్ ఆధ్వర్యంలో గ్రామ నేతలు, రైతులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ వేంపాటి పద్మజా రాంబాబు, గ్రామ పెద్దలు వలసపల్లి రామ చంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

స్థానికేతరులకు టికెట్ ఇస్తే పనిచేయం

టీడీపీ నాయకుడు కాపా శ్రీనివాసరావు

నూజివీడు: టీడీపీ నుంచి నూజివీడు టికెట్ స్థానికేతరులకు ఇస్తే ఓడిస్తామని ఆ పార్టీ నాయకుడు, నూజివీడు ఏఎంసీ మాజీ ఛైర్మన్ కాపా శ్రీనివాసరావు స్పష్టం చేశారు. స్థానిక రోటరీ కల్యాణ మండపంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ముద్దరబోయిన వెంకటేశ్వరరావుకు వ్యతిరేకంగా బుధవారం రాత్రి కాపా శ్రీనివాసరావు ఆత్మీయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024లో ఎవరికైనా సరే స్థానికులకే సీటు ఇవ్వాలని, తనకు ఇచ్చినా, వేరే వారికి ఇచ్చినా గెలిపించి తీసుకొస్తామని చెప్పారు. ఎక్కడి నుంచో ఇక్కడ వచ్చి తమపై పెత్తనం చేస్తామంటే చూస్తూ ఊరుకోబోమని స్పష్టం చేశారు. పార్టీ మారేందుకు కూడా సిద్ధమయ్యామని, టీడీపీ జిల్లా నాయకులు మూడు రోజుల సమయం ఇవ్వమని అడిగారని, దీంతో వారికి సమయం ఇవ్వడం జరిగిందని చెప్పారు. తాను పార్టీలో ఉండాలో వద్దో అధినాయకులే తేల్చుకోవాలన్నారు. ఇప్పటి వరకు పార్టీకి రూ.కోట్లు ఖర్చుచేసి కార్యకర్తలకు అండగా ఉన్నానని, అయినా అధిష్టానం గుర్తించకపోవడం దారుణమన్నారు. తనపై ముద్దరబోయిన వర్గం సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నా ఇన్‌చార్జి ఖండించడం లేదన్నారు. టీడీపీ నాయకులు మందపాటి బసవారెడ్డి, చెరుకూరి దుర్గాప్రసాద్, ఆరేపల్లి శ్రీనివాసరావు, అక్కినేని చందు పాల్గొన్నారు.

నేడు బసవా భాస్కరరావు విగ్రహావిష్కరణ

నూజివీడు: స్థానిక పురపాలకసంఘం మాజీ ఛైర్మన్ బసవా భాస్కరరావు కాంస్య విగ్రహాన్ని గురువారం ఉదయం తొమ్మిది గంటలకు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు ఆవిష్కరించనున్నారు. వెంకటేశ్వరస్వామి కోవెల సమీపంలోని కృష్ణా బడ్డీకొట్టు సెంటర్ వద్ద భాస్కరరావు కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేశారు.

నేడు వైఎస్సార్ సున్నా వడ్డీ కార్యక్రమం

నూజివీడు: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో గురువారం ఉదయం 10 గంటలకు వైఎస్సార్ సున్నావడ్డీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఏపీఎం దయాల రాజశేఖర్ తెలిపారు. ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు ముఖ్య అతిథిగా పాల్గొని మహిళలకు సున్నావడ్డీ నగదును బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తారని పేర్కొన్నారు. నూజివీడు పట్టణ, మండలానికి చెందిన స్వయం సహాయక సంఘాల సభ్యులు, ఆర్పీలు, బుక్ కీపర్లు, గ్రామైక్య సంఘాల ప్రతినిధులు పాల్గొనాలని కోరారు. మధ్యాహ్నం 12గంటలకు ఆగిరిపల్లిలో వైఎస్సార్ సున్నావడ్డీ కార్యక్రమం నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు.

డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరి

చాట్రాయి: డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై స్వామి హెచ్చరించారు. బుధవారం చాట్రాయి మండలం చనుబండ గ్రామంలో ఆయన వాహన తనిఖీలు నిర్వహించారు. ఆటోల్లో స్థాయికి మించి ప్రయాణికులను ఎక్కించవద్దని, మితిమీరిన వేగంతో వాహనాలను నడపవద్దని ఆయన వాహనచోదకులకు సూచించారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం


తిరువూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం

తిరువూరు: తమ సేవలను క్రమబద్ధీకరించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయించినందుకు తిరువూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని కాంట్రాక్టు అధ్యాపకులు హర్షం వ్యక్తం చేశారు. దీర్ఘకాలంగా పనిచేస్తున్న తమ సమస్యలను సానుకూలంగా పరిష్కరించినందుకు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలుపుతూ ఆయన చిత్రపటానికి కాంట్రాక్టు అధ్యాపకులు బుధవారం క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో కాంట్రాక్టు అధ్యాపకుల సంఘ నాయకులు కోట నగేష్, సురేష్, రాజు, తిరుపతిరావు, ఏసోబు, శ్రీను పాల్గొన్నారు.

రైతుల కోసం శ్రమించిన మహనీయుడు గౌతు లచ్చన్న


గౌతు లచ్చన్న విగ్రహానికి నివాళులర్పిస్తున్న గౌడ సంఘం నాయకులు

మైలవరం: రైతుల కోసం అహర్నిశలు శ్రమించిన మహనీయుడు గౌతు లచ్చన్న అని అఖిల భారత గౌడ సంఘం జాతీయ అధ్యక్షుడు పేరం శివనాగేశ్వరరావు తెలిపారు. స్వాతంత్ర్య సమరయోధులు, రైతు నాయకులు గౌతు లచ్చన్న జయంతి సందర్భంగా అఖిల భారత గౌడ సంఘం ఆధ్వర్యంలో స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహం వద్ద ఉన్న గౌతు లచ్చన్న విగ్రహానికి గౌడ సంఘం నాయకులు బుధవారం పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శివనాగేశ్వరరావు మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో ముఖ్య భూమిక పోషించిన గౌతు లచ్చన్న తన పోరాట పటిమతో సర్దార్ బిరుదును పొందారని తెలిపారు. రైతుల కోసం విశేషంగా కృషి చేశారన్నారు. నాడు పెద్ద మనుషులు ఒప్పందంలో కూడా ఒకరిగా ఉన్న ముఖ్యనేత లచ్చన్న అని తెలిపారు. గౌతు లచ్చన్నకు భారతరత్న ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర అధ్యక్షుడు దాసరి శ్యామ్ చంద్ర శేషు గౌడు ప్రసంగించారు.

మాజీ ప్రధాని వాజ్‌పేయికి నివాళి


పెనుగొలనులో వాజ్‌పేయి చిత్రపటానికి నివాళి

పెనుగొలను(గంపలగూడెం): గంపలగూడెం మండలం పెనుగొలను ప్రాథమిక పాఠశాలలో బుధవారం షిరిడి సాయిబాబా సేవా కమిటీ ఆధ్వర్యంలో మాజీ ప్రధాని దివంగత అటల్‌బీహారి వాజ్‌పేయి వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సాయిబాబా సేవా కమిటీ సభ్యులు పాఠశాలలో 3, 4, 5 తరగతులు చదువుతున్న విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. విశ్రాంత ఎంఈఓ వి. శేషిరెడ్డి, పాఠశాల హెచ్‌ఎం ఏవీ నరసింహారావు, గ్రంథాలయాధికారి వి. జ్యోతిర్మయి పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నంలో..

ఇబ్రహీంపట్నం: మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారి వాజ్‌పేయి వర్ధంతి కార్యక్రమం బీజేపీ ఆధ్వర్యంలో బుధవారం ఇబ్రహీంపట్నంలో జరిగింది. నియోజకవర్గం ఇన్‌చార్జ్ కుక్కపల్లి నాగేశ్వరరావు, కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు రేగళ్ల రఘునాథరెడ్డి వాజ్‌పేయి చిత్రపటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన దేశ ప్రజలకు, పార్టీకి చేసిన సేవలు కొనియాడారు.

జనవిజ్ఞాన వేదిక నూతన కమిటీ ఎన్నిక

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి జనవిజ్ఞాన వేదిక 17వ మహాసభ క్రాంతి హైస్కూల్లో జాకీర్ హుస్సేన్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.మహాబాష అధ్యక్షతన బుధవారం జరిగింది. ప్రజల్లో మూఢనమ్మకాలు దూరం చేసేందుకు, శాస్త్రీయ విజ్ఞానం పెరిగేలా చేపట్టిన కార్యక్రమాలపై సమీక్ష జరిపారు. జేవీవీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ అధ్యక్షతన కొండపల్లి శాఖ కార్యవర్గం ఎన్నిక జరిగింది. గౌరవాధ్యక్షులుగా జోనీకుమారి, డాక్టర్ సీతా రామారావు, మహాబాష, అధ్యక్షుడు ఎస్.నాగ రాజు, ప్రధాన కార్యదర్శి సర్దార్ సాహెబ్, కోశాధికారి చేతన్‌మురళి, ఉపాధ్యక్షులు, కార్యదర్శులను ఎన్నుకున్నారు.
కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మురళీమోహన్, ఉపాధ్యక్షుడు కామేశ్వరరావు, మాజీ సర్పంచ్ వెనిగళ్ల అమ్మాజీ పాల్గొన్నారు.

